క్లుప్తంగా

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

వాల్మీకిపురం: మండలంలోని కొత్తమంచూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 13 నుంచి అండర్ 14, అండర్ 17 విభాగాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం భాగ్యమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు బాల, బాలికలకు విడి విడిగా నిర్వహిస్తామని, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, అథ్లెటిక్స్, యోగా, చదరంగం తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తమ క్రీడాకారులను తీసుకొని హాజరు కావాలని ఆమె కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

రామసముద్రం: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఎస్‌ఐ సి. వెంకటసుబ్బయ్య అన్నారు. రామసముద్రం పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సి.వెంకటసుబ్బయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్‌ఐకి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ వాయల్పాడుకు బదిలీ అయ్యారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన


రామసముద్రం: రామసముద్రం మండలంలోని తిరుమలరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో వైద్య సిబ్బందికి కుష్టువ్యాధి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎంపీఓ శ్రీనివాసులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యం తీసుకుంటే వ్యాధి తొందరగా నయం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఉమాదేవి, ఏఎన్‌ఎంలు ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి


బస్‌షెల్టర్ల నిర్మాణానికి నోచుకోని తరిగొండ బస్టాండు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలోని బస్టాండులో బస్‌షెల్టర్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు గాంచిన తరిగొండ వెంగమాంబ పుట్టినిల్లు ఇదే గ్రామం కావడం గమనార్హం. దీంతో మన జిల్లా నుంచే కాకా రాయలసీమలోని మిగతా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గ్రామంలోని ఆలయానికి వస్తుంటారు. నిత్యం రాకపోకలు సాగించే భక్తులు, పర్యాటకులకు బస్టాండులో కనీసం నిలువనీడలేక ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండులో గానీ, ఆలయం పక్కన బస్‌షెల్టర్లు లేవు. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు, ఆలయానికి సంబంధించిన స్థలాలు ఉన్నప్పటికీ వినియోగించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొందరు సదరు స్థలాలను ఆక్రమించుకొంటున్నారని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి కనీసం ఇక్కడ బస్‌షెల్టర్లు నిర్మిస్తే అందరికి సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు.

వైభవంగా ముగిసిన కుంభాభిషేకం


శాంతి హోమం చేస్తున్న భక్తులు

తంబళ్లపల్లె: మండల కేంద్రంలో టీఎస్ కుటుంబీకులు నిర్మించిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సంప్రోక్షణ, కుంభాభిషేకం కార్యక్రమాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. టీ.ఎస్.విజయనారాయణరెడ్డి, శోభారెడ్డి దంపతులు, హర్షారెడ్డి, శ్రీలతరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు సంప్రదాయ బద్ధంగా మహా కుంభాభిషేకం, శాంతి హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు స్వామి దర్శనంతో తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖరరెడ్డి, సౌమ్యిరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

బి.కొత్తకోట: వినాయక చవితి సందర్భంగా స్థానిక పోకనాటివీధిలో కోదండ రామస్వామి ఆలయ కమిటీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భారీ విగ్రహం ఏర్పాటు చేయగా శనివారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదురోజులుగా ప్రతిరోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వివి.రెడ్డి, వాకా హరినాథరెడ్డి, మారెడ్డి రవీంద్రరెడ్డి, కంచి లోకేష్‌రెడ్డి, హరినాథరెడ్డి,మారెడ్డి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

దాహం.. దాహం..!

- తాగునీటి కోసం తప్పని తిప్పలు
- నాలుగు నెలలుగా ఇబ్బందులు
- కొలను నీరే గతి

గొల్లపల్లెలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం కటకటలాడుతున్నారు. గ్రామంలో ఉన్న ఒక్క బోరు పనిచేయడం లేదు. మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ శివారులో ఉన్న కొలను నీటితో దాహం తీర్చుకుంటున్నారు. కొలను నీరు రంగుమారి కంపుకొడుతున్నాయి. దీంతో గత్యంతరం లేక కలుషిత నీటితోనే కాలం వెల్లబుచ్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ గోడును పట్టించుకోవాలని వేడుకుంటున్నారు.


కొలనులో నీటిని తీసుకుపోతున్న మహిళ

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ గొల్లపల్లిలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాలుగు నెలలుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గొల్లపల్లిలో సుమారు 700 కుటుంబాలు ఉన్నాయి. చాలా మంది పశువులు, గొర్రెలు, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో నీటి బోరు ఏర్పాటు చేశారు. అయితే నాలుగు నెలల క్రితం బోరు మోటారు చెడిపోయింది. అప్పటి నుంచి బోరుకు మరమ్మతులు చేయలేదు. దీంతో ప్రజలు తాగునీటి కోసం పడరానిపాట్లు పడుతున్నారు. తమ సమస్య ఎవరికి చెప్పినా చేస్తామంటున్నారే తప్పా సమస్యను పరిష్కరించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కొలను నీరే శరణ్యం

గ్రామంలో కొలను ఉంది. గ్రామస్థులు కొలను నీటితో కాలం వెళ్ల దీస్తున్నారు. ఈ నీళ్లే పశువులు, గొర్రెలు కూడా తాగుతున్నాయి. నీరు రంగు మారి దుర్వాసన వస్తోంది. ఈ నీళ్లు తాగడం వలన చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. తాగేందుకు సమీపంలోని మూడు కిలోమీటర్ల దూరంలోని కట్టుబావికి వెళ్లి తాగునీరు బిందెలతో తెచ్చుకుంటున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గ్రామంలో తాగు నీరు కోసం పడరాని పాట్లు పడుతున్నాము. నాలుగు నెలల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులకు చెబుతున్నాం. ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తాం అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సమస్య పట్టించుకోలేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

–ధనపతి, గొల్లపల్లి, మదనపల్లె మండలం

శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలి



గ్రామంలో గత కొన్నేళ్ల నుంచి తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. బోరు పాడైపోతే పట్టించుకోరు. తాగునీరు కావాలంటే మూడు కిలో మీటర్లు నడవాల్సిందే. ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

–రెడ్డప్ప, గొల్లపల్లి.మదనపల్లె మండలం

బి.కొత్తకోటకు మల్టీస్టోరేజీ గోదాము మంజూరు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలానికి కేంద్రప్రభుత్వం మల్టీస్టోరేజీ గోదామును మంజూరు చేసిందని సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మల్టీస్టోరేజీ గోదాము నిర్మాణం ద్వారా రైతాంగానికి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు వచ్చేదాక గోదాములో నిల్వ చేసుకునే సౌలభ్యం ఉంటుందని పేర్కొన్నారు. నిర్మాణం కోసం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. భూమి కేటాయించిన వెంటనే నిర్మాణ పనులు మొదలు పెడతామని చెప్పారు. కాగా బి.కొత్తకోట పీఏసీఎస్‌లో బంగారు ఆభరణాలపై ఐదు నిమిషాల్లో రూ.5లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని, 8.5శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తామని చెప్పారు. రైతులు, ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సొసైటీ సభ్యులు వివరాలివ్వాలి

సహకార వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)లో సభ్యులుగా ఉన్నవారు తమ వివరాలను అందజేయాలని ప్రత్యేక అధికారి ఎ.ప్రవీణ్‌కుమార్, సీఈవో ఆదినారాయణ కోరారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రతిసభ్యుడు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, పాన్‌కార్డు, ఓటర్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు ఇవ్వాలని కోరారు. సభ్యుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నామని, ఇక సభ్యుల వివరాలు పారదర్శకంగా ఉంటాయని ఆయన చెప్పారు.

వరద బాధితులకు రూ.5 లక్షల సాయం

కురబలకోట: విజయవాడ వరద బాధితులకు అంగళ్లలోని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం. ప్రభాకర్ రెడ్డి గురువారం రాష్ట్ర సీఎం చంద్రబాబును కలసి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి కూడా పాల్గొన్నారు. విశ్వం ప్రభాకర్‌రెడ్డిని సీఎం చంద్రబాబు అభినందించారు.

ఎన్‌ఎస్‌ఎస్ సాయం

కురబలకోట: విజయవాడ వరద బాధితులకు అంగళ్లులోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు రూ. 51 వేలు విరాళాన్ని సీఎం సహాయనిధికి అందజేసినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ గురువారం తెలిపారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకుల ద్వారా ఈ సాయాన్ని సమీకరించి అందజేసినట్లు తెలిపారు.

పీలేరు ఇన్‌చార్జి సీఐగా దస్తగిరి

పీలేరు రూరల్ : పీలేరు అర్బన్ ఇన్‌చార్జి సీఐగా దస్తగిరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ యుగంధర్ మెడికల్ లీవ్‌పై వెల్లడంతో ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో పని చేస్తున్న దస్తగిరి పీలేరు ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

పీలేరు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీతారం ఏచూరి ఆర్థిక వేత్తగా, సామాజిక కార్యకర్తగా, కాలమిస్టుగా గుర్తింపు తెచ్చుకొన్నారని, దేశరాజకీయాల్లో చక్రం తిప్పారని కొనియాడారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


మదనపల్లె సిటీ: వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


నిమ్మనపల్లె : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ నారాయణ

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మదనపల్లె మండల స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో యోగా, చెస్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మండల స్థాయిలో రాణిస్తే నియోజకవర్గం, జిల్లా స్థాయిలో పాల్గొనవచ్చునన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ఉత్తేజం కలిగి జీవితంలో క్రమశిక్షణ కలిగి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రాజగోపాల్, హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, ఆంజనేయులు, మండల కోఆర్డినేటర్ శివశంకర్, పీడీలు దేవకమ్మ, నరేష్, జలజ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నిమ్మనపల్లె : క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని ఎంఈఓ నారాయణ, జెడ్పీహైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం.వాణి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీహైస్కూల్ (తెలుగు) క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ వారి ఆదేశాలతో ఎంఈఓ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో బాల,బాలికలకు మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నారాయణ క్రీడాపోటీలను ప్రారంభించారు.

విజేతలు వీరే..

స్కూల్‌గేమ్స్‌లో భాగంగా మొదటిరోజు నిర్వహించిన పోటీల్లో అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో రెడ్డివారిపల్లె, బాలికల విభాగంలో బాలినాయనపల్లె హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అదేవిధంగా అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో నిమ్మనపల్లె, బాలికల విభాగంలో బాలినాయనపల్లె విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు పీటీ భద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు మణికుమార్, సుజాత, ఉపాధ్యాయులు వెంకటగోపాల్, రవి, జయశ్రీ, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

మదనపల్లె : యువత క్రీడల్లో రాణించాలని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి ఆకాంక్షించారు. గురువారం మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లెకు చెందిన యువ క్రీడాకారులు వల్లాల దర్శన్‌రాజు, వినయ్‌కుమార్ నేపాల్‌లోని పోఖారాలో టీ 20 క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన నేపథ్యంలో గురువారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామసముద్రం మండలంలో చిన్న గ్రామం నుంచి జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికవడం సాధారణ విషయం కాదని, ఎంతో కృషి, ప్రతిభ ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. క్రీడాకారులు క్రికెట్ ప్రాక్టీస్ చేసేందుకు వీలుగా తనవంతు సాయంగా రూ.15 వేలు విలువ చేసే క్రికెట్ కిట్‌ను వల్లాల దర్శన్‌రాజు, వినయ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వారు సర్పంచ్ చలపతికి కృతజ్ఞతలు తెలుపుతూ... సెప్టెంబర్ 18వ తేదీ నుంచి 22 వరకు ఐదురోజుల పాటు నేపాల్‌లోని పోఖారాలో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ టీ20 క్రికెట్‌తరపున పాల్గొంటున్నామన్నారు. కార్యక్రమంలో బోయపాటి మురళీ, సాయిశేఖర్‌రెడ్డి, బందార్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ కేఎస్ బాలాజీ

పెద్దతిప్పసముద్రం: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, అక్టోబర్ 2 నాటికి అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. ఈ నెల 17 నుంచి 'స్వచ్ఛతయే సేవ' కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం నిర్వహణను కచ్చితంగా చేపట్టాలని పేర్కొన్నారు. ఈఓఆర్డీ యోగానంద, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ తిరుపాలప్ప ఉన్నారు.

క్విజ్‌పోటీలకు విద్యార్థుల ఎంపిక

సంబేపల్లె : రాష్ట్రస్థాయి రెడ్ రిబ్బన్ పోటీలకు సంబేపల్లెలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నరసింహారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి చదువున్న విద్యార్థినులు రుక్సార్, రుక్సానాలకు వారికి శిక్షన ఇచ్చిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డిలను పాఠశాలలో సన్మానించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయసారథి రెడ్డి, దేవప్రసాద్‌రెడ్డి, రామయ్య, మహబూబ్‌బాషా, రెడ్డిశుఖర్, సురేంద్రరాజు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు


గుర్రంకొండలో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

గుర్రంకొండ: విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. మండలకేంద్రమైన గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక కొత్తపేట, ఎల్లుట్లగడ్డ, దళితవాడల్లో కొలువు దీర్చిన గణేష్ ప్రతిమలను వైభవంగా ఊరేగించారు. తమిళనాడు,కేరళ రాష్ట్రాలకు చెందిన నృత్య కళాకారుల విన్యాసాలు, గిరిజనలు జానపదాలు, మల్లయ్యకొండ భల్లూకవేషధారణలు ఊరేగింపులో ఆకట్టుకొన్నాయి. మహాశివుడు, కాళికామాత వేషధారణలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూలకు వేలం పాటలు నిర్వహించారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మధురామచంద్రు గట్టిబందోబస్తు చర్యలు చేపట్టారు. సమీప చెరువుల్లో స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగిశాయి.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలి


పెద్దతిప్పసముద్రం: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు


తంబళ్లపల్లె: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె: విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఎంఈఓ త్యాగరాజు సూచించారు. గురువారం గోపిదిన్నె ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ బోధన తీరు, విధి నిర్వహణ అంశాలపై ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సురేంద్రరెడ్డి, ఎంపీపీ హెచ్‌ఎం నాగమణి ఆరా తీశారు. అనంతరం గోపిదిన్నె, కొటాల గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల పనితీరు, విధులకు హాజరయ్యే బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పెద్దతిప్పసముద్రం: స్థానిక మోడల్ స్కూల్‌ను ఎంపీడీఓ కేఎస్ బాలాజీ, ఎంఈఓ-2 గౌస్‌పీర్ గురువారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అమలయ్యేలా చూడాలని సూచించారు. 242 మంది విద్యార్థులకు గాను 240 మంది పాఠశాలకు హాజరైనట్లు గుర్తించారు. చదువులో వెనుకబడిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. పిల్లలకు సులభ పద్ధతుల్లో నాణ్యమైన విద్యాబోధన చేయాలని పేర్కొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లపై ఆరోపణలు నిరాధారం

పీలేరురూరల్ : స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు ప్రైవేట్ ల్యాబ్‌లు నిర్వహిస్తూ, ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులను తమ ల్యాబ్‌లో టెస్టులు చేయించుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రతి రోజూ సగటు వంద మందికి సుమారు వెయ్యి రకాల పరీక్షలు ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నారని తెలిపారు.

బీసీజీ టీకా సురక్షితం


కలికిరిలో బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి: బీసీజీ టీకా సురక్షితమని, ఎటువంటి అపోహలు లేవని, ప్రతిఒక్కరూ తప్పకుండా టీకా వేయించుకుని క్షయవ్యాధి నుంచి విముక్తి పొందాలని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప పేర్కొన్నారు. మండలంలో గురువారం 102 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు చిన్నరెడ్డెప్ప తెలిపారు. కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో 53 మంది ఉపాధ్యాయులకు, గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో 49 మంది ఆటో, ట్యాక్సీ డ్రైవర్లుకు, మొత్తం 102 మందికి టీకాలు వేశామని, ప్రతి సోమ, గురు వారాల్లో పెద్దలకు ఈ బీసీజీ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పొగతాగే అలవాటు ఉన్నవారు, టీబీ రోగి కాంటాక్ట్స్, ఎత్తుకు తగిన బరువు లేని వంటి వారు తప్పనిసరిగా బీసీజీ టీకాలు వేయించుకోవాలని సూచించారు.హెచ్‌ఈ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం జీ టెక్ జైన్ ఎడ్యుకేషన్ బెంగుళూరుకు చెందిన కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బిటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 17 మంది ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.3.5 లక్షల ప్యాకేజీ ఇవ్వబడుతుందని కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సతీష్, ప్లేస్‌మెంట్ అధికారి మనోజ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పీలేరు : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజమ్మ


మదనపల్లె : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

పీలేరు : ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ రాజమ్మ అన్నారు. బుధవారం పీలేరు, కేవీపల్లె, కలకడ మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో పౌష్టికాహార మాసోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. ప్రీస్కూల్ విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు కొలచి ఎదుగుదల ఎలా ఉందో రిజిష్టర్లలో నమోదు చేయాలని పేర్కొన్నారు. డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు ఉమా, స్వర్ణ, స్వరూప, అక్కయ్య, భారతి, శాంతి, యశోద పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

మదనపల్లె : ప్రతి అంగన్‌వాడీ టీచర్ సమయపాలన పాటించాలని ఐసీడీయస్ సీడీపీఓ సుజాత ఆదేశించారు. మదనపల్లె ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధి అంగన్‌వాడీలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను తప్పక పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ప్రతి కేంద్రంలో రిజిస్ట్రేషన్ అయిన 0-5 ఏళ్ల పిల్లలకు ప్రతినెల ఎత్తు, బరువులు రికార్డు చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చిన్నారులకు అదనంగా ఆహారం ఇవ్వాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఇచ్చిన ఫోన్లలో ఉదయం 9.30 గంటలలోపు పిల్లల హాజరును నమోదు చేయాలన్నారు. వీటితోపాటుగా ప్రి స్కూల్ యాక్టివిటీస్ టైమ్ షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి

మదనపల్లె : జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి ఔట్‌సోర్సింగ్ జీడీఏ సిబ్బంది ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ఒంటికాలిపై నిల్చుని ఆస్పత్రి అత్యవసర విభాగం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు తోపు కృష్ణప్ప, జిల్లా కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ మదనపల్లె సర్వజన బోధన ఆస్పత్రిలో గత 18సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎఫ్‌ఎంఓ, ఎంఎంఓ, ఓటీ అసిస్టెంట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 13 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి సర్వజన బోధన ఆస్పత్రిగా అప్డేట్ అయిన తర్వాత కార్మికుల వివరాలు సకాలంలో ఆప్కాస్‌కు పంపించకపోవడంతో జీతాలు లేక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పదిరోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ అధికారుల్లో చలనం లేదని విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు తిరుమల, షేక్ ముబారక్, చంద్రశేఖర్, పెద్దన్న, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, రాణి, గంగాదేవి పాల్గొన్నారు.